క్లుప్తంగా

ఉద్యమంలా సంతకాల సేకరణ


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ప్రకటించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈనెల 19న మండపేటలోని విజయలక్ష్మి నగర్‌లో ఉదయం 10 గంటలకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మెయిన్ రోడ్డు, బస్ స్టాండ్, కలువ పువ్వు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రజల నుంచి సంతకాలను స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో రాయవరం టౌన్ 2, మాచవరం ఫీడర్ మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. రాయవరం 11 కేవీఏ టౌన్ ఫీడర్, మాచవరం ఫీడర్ పరిధిలోని రాయవరం, అనపర్తి మండలం మహేంద్రవాడకు విద్యుత్ సరఫరాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయన తెలిపారు.

శాస్త్రీయ సాగు పద్ధతులు అవలంబించాలి


నల్లూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవి

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ సాగు పద్ధతులపై ప్రతి రైతుకు అవగాహన అవసరమని మండల వ్యవసాయాధికారి బలుసు రవి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లూరులో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ రవి మాట్లాడుతూ 14 వారాల పాటు నిర్వహించే పొలంబడి అవగాహన కార్యక్రమం ద్వారా రైతులకు వరి సాగు పద్ధతులపై అవగాహన పెరుగుతుందన్నారు. విచక్షణారహితంగా పురుగు మందులు పిచికారీ చేయడం అశాస్త్రీయమని రవి అన్నారు. పర్యావరణ పరిరక్షణ, మిత్ర పురుగులను కాపాడుకోవడంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చింతా రవి వర్మ, పీఏసీఎస్ సీఈఓ గుత్తుల సతీష్, గ్రామ నస్తులు ముత్యాల వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహనా కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం సర్కిల్ వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆట బొమ్మలు, క్రీడా వస్తువుల ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రమణకుమారి మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించేలా జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌తో క్రీడా సామగ్రి, ఆట బొమ్మలు మరింత చౌకగా ప్రజలకు అందుబాటులోనికి వచ్చాయన్నారు. ఈ ప్రయోజనాలు ప్రజలు అందిపుచ్చుకోవాలని కోరారు. ఏమే వస్తువులపై ఎంత మేరకు ప్రయోజనం చేకూరుతుందో ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో .ఈఎస్టీఓలు అనిత, సుబ్బలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మణికంఠ రామచరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింక్ టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన


మండపేటలో పింక్ టాయిలెట్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపాలిటీ నిధులు రూ.8 లక్షలతో మండపేట పట్టణం వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ మార్కెట్ వద్ద పింక్ టాయిలెట్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, డీఈ శ్రీనివాస్ ఏఈ అనూషాలక్ష్మి, మెప్మా టీఎంసీ సుజాత పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించం



కపిలేశ్వరపురం: ప్రజాస్వామ్య సమాజంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించేది లేదని పలువురు సీనియర్ విలేకరులు, పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డికి నోటీసులు ఇస్తూ విచారణ పేరుతో వేధింపులకు పాల్పడటాన్ని నిరసిస్తూ శుక్రవారం కపిలేశ్వరపురంలో ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ భానూజీకి వినతిపత్రాన్ని అందజేశారు. సీనియర్ విలేకరులు పెద్దింశెట్టి లెనిన్ బాబు, పాలింగి శ్రీనివాస్, చిట్టికుమార్, శేఖర్, దళిత నేత నక్కా సింహాచలం, పిప్పర సంపతరావు, బీసీ సంఘం నాయకులు కట్టా మురళి, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు జిత్తుక వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పేరాబత్తుల రామకృష్ణ, సలాది వీరబాబు, ఉమ్మిడిశెట్టి సూరిబాబు కూటమి ప్రభుత్వ వేధింపులను ఖండించారు. మీడియా సంస్థల యాజమాన్యాలను, ఉద్యోగులు, విలేకరులను వేధింపులకు గురిచేయడం అప్రజాస్వామికమని వారన్నారు.


కపిలేశ్వరపురంలో ఎంపీడీఓ భానూజీకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

వరికి ఎండాకు తెగులు

- అధిక నత్రజని వాడకంతో అనర్థం
- ఎరువుల వినియోగంలో ముందుచూపు అవసరమంటున్న వ్యవసాయాధికారులు
- ఆందోళనలో రైతులు


బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకి చనిపోతున్న వరి దుబ్బు


మొగలిపాలెంలో ఎండాకు తెగులు సోకిన వరి పొలం

కాజులూరు: వరి పంటపై బ్యాక్టీరియా ఎండాకు తెగులు దాడి చేసింది. తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండల గ్రామాల్లో పంటకు ఎండాకు తెగులు సోకుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

రామచంద్రపురం నియోజకవర్గ గ్రామాల్లో 67 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది తొలకరిలో 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. నియోజకవర్గ గ్రామాల్లో ప్రస్తుతం వరి ఈనిక దశ నుంచి గింజ పాలుపోసుకునే దశలో ఉంది. ఈ తెగులు సోకిన పొలంలో వరి ఆకు సుతల నుంచి అంచుల వెంబడి ఎండిపోతూ వరి మొక్క క్రమేపీ చనిపోతుంది. వాతావరణంలో తలెత్తిన మార్పులు కారణంగా పంటపై బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకేందుకు అవకాశం ఉండగా, రైతులు గింజ నారుపోసే ముందు విత్తనశుద్ధి చేయకపోవడం, పంట తొలిదశ నుంచి అవసరాన్ని మించి అధికంగా నత్రజని వాడడంవల్ల బ్యాక్టీరియా ఎండాకు తెగులు వచ్చేందుకు ఎక్కువగా అవకాశం ఉందని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు. సకాంలో నివారణ చర్యలు చేపట్టకపోతే ఈ తెగులు సోకిన తర్వాత పూర్తిస్థాయిలో నివారించడం కష్టమవుతుందన్నారు.


వి.అశోక్, కాజులూరు మండల వ్యవసాయాధికారి

నివారణా చర్యలు

బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకిన ఆకులను కత్తిరించి గాజు గ్లాసులో పరిశుభ్రమైన నీటిలో ఉంచినప్పుడు ఆకుల నుంచి ఒక రకమైన జిగురు వంటి ప్రదార్థం ప్రవించి నీరు మురుకుగా మారుతుందన్నారు.

- తెగులు వరి దుబ్బులో కోటాకుకు సోకకుండా జాగ్రత్త పడాలన్నారు. కోటాకుకు నష్టం జరిగితే దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందన్నారు.
- ముందస్తుగా నారుపోసే ముందు విత్తనాలను శుద్ధి చేసుకోవాలి. ఒక కేజీ విత్తనాలకు సుడోమోనాస్ 10 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయాలన్నారు.
- పంటపై తెగులు లక్షణాలు గుర్తించిన వెంటనే రైతులు నత్రజని వాడకాన్ని పూర్తిగా మానివేయాలన్నారు.
- సెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ (ప్లాంటోమైసిన్) మందును రెండు గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి 200 లీటర్ల మందు ద్రావనాన్ని ఎకరం పంటపై పిచికారీ చేయడం ద్వారా తెగులు ఉధృతిని కొంత వరకూ తగించవచ్చునన్నారు. ఈ మందులో మరే ఇతర మందులు, ఎరువులతో కలిపి పిచికారీ చేయకూడదన్నారు.
- రైతులు పంట చివరి దమ్ములో ఒకసారి, పంట చిరుపొట్ట దశలో ఒకసారి ఎకరాకు 25 కేజీలు పోటాష్ వేసుకున్నట్లయితే వ్యాధి నిరోధక శక్తి పెరిగి, గింజ నాణ్యత పెరుగుతుందన్నారు.
- పంటలపై రైతులు అవసరాన్ని మించి ఎరువులు, పురుగు మందులు వాడకం అనర్థాలకు దారితీస్తుందని సాగు తొలి దశ నుంచి నత్రజని వాడకాన్ని నియంత్రించినట్లయితే బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకకుండా అరికట్టవచ్చునన్నారు.

ఆందోళనకు గురవుతున్నాం



పంట చివరి దశలో ఎండాకు తెగులు సోకడంతో భయాందోళనకు గురవుతున్నాం. ముందు ఆకు సుతల నుంచి ఎర్రగా మారి క్రమేపి పొలమంతా ఎండిపోతున్నట్టుగా కనిపిస్తోంది. ఇప్పటికే వేలాది రుపాయలు పెట్టుబడి పెట్టాం. పురుగు మందుల ధరలు పెరగటంతో తెగులును అధిగమించటం కష్టతరంగా మారింది.

– కర్రి రామారెడ్డి, రైతు గొల్లపాలెం

దిగుబడిపై ప్రభావం



వరి పంట గింజ పాలుపోసుకునే దశలో ఆకులు ఎండిపోతుండటంతో దిగుబడిపై ప్రభావం చూపుతుంది. గింజలు గట్టిపడకపోతే తాలు, తప్పలుగా మారిపోతాయి. తెగుళ్లను నివారించేందుకు వ్యవసాయాధికారులు సహకరించాలి.

– సువ్వారి గోవిందు, రైతు తర్లంపూడి

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ


పామర్రులో సంతకాలు సేకరిస్తున్న సీనియర్ నాయకుడు సుబ్బారావు తదితర పార్టీ శ్రేణులు

కె.గంగవరం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రామంచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ నేతృత్వంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమంలా సాగుతోంది. మండల పరిధిలోని పామర్రు, తామరపల్లి, సుందరపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ప్రజలు, విద్యార్థుల నుంచి సంతకాలు సేకరిస్తున్నారు. పామర్రులో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పంపన సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలో పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని మొదలుపెట్టారన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పేదలకు మంచి వైద్యం అందించడానికి ప్రయత్నం చేయకుండా ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని ప్రజలు విమర్శిస్తున్నారని తెలిపారు. మాజీ జిల్లా వ్యవసాయ సలహా కమిటి సభ్యులు బత్తుల అప్పారావు, సర్పంచ్‌లు వాసంశెట్టి దుర్గా, లక్ష్మీ శిరీష, నాయకులు, కూళ్ల సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ రెడ్డి జయరాజు, నాయకులు సాదే కపిల్, పెన్నాడ త్రిమూర్తులు, మట్టపర్తి వరప్రసాద్, వాసంశెట్టి పట్టాభి, కుడుపూడి నాని, అనుసూరి శ్రీనివాస్, మేడిశెట్టి సత్యనారాయణ, వశిష్ట మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సుందరపల్లిలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు బత్తుల అప్పారావు తదితరులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎస్ ఉదయభాస్కర్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, బందనపూడి, శలపాక, మంజేరు, టి.మామిడాడ, పెనుమళ్ళ, అంద్రంగి, జగన్నాథగిరి, కరప మండలంలోని కొంగోడు, పెద్దాపురపాడు, విజయరాయుడుపాలెం, యండమూరు, గొర్రిపూడి, కాజులూరు 11 కేవి ఇండ్రస్ట్రియల్ ఫీడర్ పరిదిలోని అయితపూడి, శీల, ఒంటితాడి, తిప్పరాజుపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

కె.గంగవరం: పామర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.


ఎంపీపీగా సాకా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

కపిలేశ్వరపురం: మండల పరిషత్ అధ్యక్షుడిగా అద్దంకివారిలంక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎంపీపీగా పనిచేసిన టీకి ఎంపీటీసీ మేడిశెట్టి సత్యవేణి వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ ఉన్నతాధికారుల ఆదేశాలపై నిబంధనలు మేరకు ఈనెల 13న ఎంపీపీ సాకా శ్రీనివాస్‌ను నియమించారు. కార్యాలయంలో శుక్రవారం శ్రీనివాస్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పుట్టా అబ్బు, సహచర ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ భానూజీ, కార్యాలయ నిర్వహణాధికారి జి.రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జిత్తుక వెంకటలక్ష్మి, యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఉమ్మిడిశెట్టి వీరవేణి, అడ్డాల శ్రీనివాస్, నాయకులు నక్కా సింహాచలం, పిప్పర సంపతరావు, కొండేటి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రామకృష్ణ, సలాది వీరబాబు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు పాల్గొన్నారు.


ఎంపీపీ సాకా శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కాజులూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు ఖండవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహిచి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు పలివెల ఇజ్రాయిల్‌రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని రాజ్యాంగంపైనా, దళితులపైనా జరిగిన దాడిగా పరిగనించి ప్రభుత్వం వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పలివెల రాజు, గొల్లపాలెం ఎంపీటీసి జొన్నకూటి వెంకటేశ్వర్రావు, కొమ్ము కృష్ణమూర్తి, ఇందుర్తి బుజ్జి, లాజరు, రాయి రవి, పలివెల రవి, సత్యనారాయణ, యాకోబు తాతపూడి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జాగ్రత్తలు తీసుకుంటే నొప్పులు మాయం

- ఫిజియోథెరపిస్టులు మోహిత్, సీత
- ర్యాలిలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

కొత్తపేట: జాగ్రత్తలు తీసుకుంటూ, వ్యాయామం చేయడం ద్వారా భుజం, మోకాళ్లు, నడుము నొప్పులు నుంచి విముక్తి పొందవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్టు వైద్యులు డాక్టర్ చింతా మోహిత్, డాక్టర్ సీత తెలిపారు.ర్యాలి గ్రామంలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ డే కేర్ హోంలో శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్, సీత ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘ్ కన్వీనర్ డాక్టర్ ఉప్పుగంటి భాస్కరరావు ప్రారంభించారు. శిబిరంలో అవసరమైన 10 మందికి ఫిజియోథెరపీ మెటీరియల్ అందజేశారు. నొప్పులతో బాధపడుతున్న సుమారు 60 మంది శిబిరాన్ని వినియోగించుకున్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమం ప్రోత్సాహకులు వందనాదేవి, సీతారత్నం, తేజశ్రీ అన్నపూర్ణ, శ్రీధర్, కుమారలక్ష్మి తధితరులు పాల్గొన్నారు.


ర్యాలిలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యులు మోహిత్, సీత

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఆలమూరు, మండపేట, మండపేట రూరల్, అంగర పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 24 మంది నిందితులకు జరిమానా విధించారు. కోర్టు వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక్కొక్కరికి రూ.10500 జరిమానాను విధించినట్టు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన కాశి బాబాయ్, శ్యామల దంపతులు శుక్రవారం రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని వినాయక రావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

18 నుంచి చెకుముకి సంబరాలు


వల్లూరులో చెకుముకి వివరాలు ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

కపిలేశ్వరపురం: విద్యార్థి దశలోనే విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలను నిర్వహిస్తున్నట్టు వేదిక మండల కమిటీ అధ్యక్షుడు వాసంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంబరాలు వివరాలున్న పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. 18న పాఠశాల స్థాయిలో చెకుముకి సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. పాఠశాల బృందాలతో నవంబర్ 1న మండల స్థాయి, డిసెంబర్ 12, 13, 14లో జిల్లా స్థాయి సంబరాలను నిర్వహించనున్నామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని శ్రీనివాస్ కోరారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ


పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణకు ప్రింటర్ అందజేస్తున్న దాత సత్య స్వరూపరెడ్డి

రాయవరం: పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాత వితరణతో ప్రింటర్ బహూకరించారు. గ్రామానికి చెందిన కర్రి సత్యస్వరూపరెడ్డి రూ.15వేల విలువైన ప్రింటర్‌ను పాఠశాల హెచ్‌ఎం ఎస్.ఆదినారాయణకు శుక్రవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో దాతల పాత్ర చాలా కీలకమంటూ వారిని హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనుల పరిశీలన


మండపేటలో జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): ఆలమూరు రోడ్డులోని ఆర్అండ్‌బీ రహదారి వెంబడి జంగిల్ క్లియరెన్స్ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు. పట్టణ శివారు నుంచి ఆలమూరు రోడ్డులోని జైన్ దేవాలయం సమీపం వరకూ తుప్పలను తొలగిస్తున్నారు. పనుల తీరును మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్ వివరించారు.

శ్రీనివాసు మాస్టారికి పితృ వియోగం

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఉపాధ్యాయ విభాగ కన్వీనర్, ఆర్యావటం మదర్ ఇంట్రిగేల్ బీఈడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పోతు శ్రీనివాసు మాస్టారు పితృ వియోగంతో బాధపడుతున్నారు. దుగ్గుదుర్రుకు చెందిన శ్రీనివాసు మాస్టారు తండ్రి కె.సత్యం(80) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. సత్యం రైతు సంఘం నాయకుడిగా పని చేస్తూ 1998లో దుగ్గుదుర్రు పీఏసీఎస్ డైరెక్టరుగా ఎన్నికైన వరుసగా మూడు పర్యాయాలు ఆ పదివిలో కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ సీపీలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. సత్యం మృతిపై నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగ కన్వీనర్ రేమళ్ల చిట్టియ్యదొరా, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మాత నూకరావు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ రాజేశ్వరరావుకు డీసీగా పదోన్నతి

కొత్తపేట: ఆత్రేయపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న టీ రాజేశ్వరరావు డిప్యూటీ కలెక్టర్ (డీసీ)గా పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది తహసీల్దార్లకు డీసీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినట్టు జిల్లా నుంచి రాజేశ్వరరావు ఆ జాబితాలో ఉన్నారని కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఆయనకు పోస్టింగ్ కేటాయించాల్సి ఉందని తెలిపారు. ఈసందర్భంగా రాజేశ్వరరావును శుక్రవారం సాయంత్రం కార్యాలయం అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇన్నాళ్లు మండలంలో రెవెన్యూ సేవలకు సంబంధించి అన్ని విధాలుగా తనకు సహకరించిన ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్‌డీ రామచంద్రమూర్తి, ఎంఆర్ఐ యం భాను, కార్యాలయం సిబ్బంది, వీఆర్ఓలు, చౌకడిపో డీలర్లు పాల్గొన్నారు.

ఇళ్లల్లో నీటిని నిల్వ ఉంచొద్దు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్య నెలకొల్పేందు ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే) నిర్వహించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.శిరీష, వంశీ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బు రోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు.